కోహీర్‌లోని సికిందర్‌వాడీ ప్రాథమిక పాఠశాల ఆవరణ దుస్థితి(ఫైల్)

బాగైన బడి బాట

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

పాఠశాల ఆవరణను శుభ్రం చేయించిన అధికారులు

కోహీర్, జూన్ 8: ఓ వైపు బడి బాట కార్యక్రమం.. మరో వైపు పాఠశాల ఆవరణ చెత్తమయం.. అంటూ శనివారం నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించారు. మండల కేంద్రమైన కోహీర్ పట్టణంలోని సికిందర్‌వాడీ కాలనీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే బాటపైనే చెత్తను పారేశారని అధికారుల దృష్టికి రావడంతోపాటు పరిస్థితి ఇలాగే ఉంటే విద్యార్థులు అనారోగ్యంపాలు కావాల్సిందేనని నమస్తే దినపపత్రిక ద్వారా తెలుసుకొని వెంటనే కార్మికుల సహాయంతో పాఠశాల ఆవరణ, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలోని చెత్తను తొలిగించారు. పూర్తిగా శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దీంతో దోమలు, ఈగలు, దుర్వాసన వచ్చే అవకాశం లేదు. తద్వారా విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు సౌకర్యవంతంగా మారింది. తమ పిల్లల ఇబ్బందులను తీర్చేందుకు కృషి చేసిన నమస్తే తెలంగాణ యాజమాన్యానికి విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

చెత్తను తొలిగించి పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న కార్మికులు

అగ్ని వీరులకు ఘనస్వాగతం

ఝరాసంగం, జూన్ 8: దేశ సేవకు అగ్నిపథ్‌లో ఎంపికై శిక్షణ పూర్తి చేసుకొని గ్రామానికి తిరిగివచ్చిన అగ్నివీర్ సైనికులకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. మండల పరిధిలోని బర్దిపూర్, పొట్టిపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు స్నేహితులు ప్రశాంత్, సాగర్ అగ్నిపథ్‌లో ఎంపికై ఎనిమిది నెలలపాటు శిక్షణ కాలాన్ని హైదరాబాద్‌లో పూర్తి చేసి శుక్రవారం తిరిగి స్వగామాలకు వచ్చారు. ఇరువురు స్నేహితులకు గ్రామస్తులు మంగళ హారతులు పట్టి హర్షం వ్యక్తం చేశారు.

అగ్నివీరులకు హారతి పడుతున్న గ్రామస్తులు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

పుల్కల్, జూన్ 8: మంత్రి దామోదర రాజనర్సింహ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి అన్నారు. గురువారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ గెలిచిన 100 రోజుల్లోనే దామోదర నియోజకవర్గ అభివృద్ధికి రూ.500 కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. గెలిచిన వెంటనే రూ.168 కోట్లతో సింగూరు కెనాల్ కాల్వకు సీసీ లైన్ మంజూరు చేయించినట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ చౌటకూర్ మండల అధ్యక్షుడు నత్తి దశరథ్, మండల యూత్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, మాజీ డీసీసీబీ డైరెక్టర్ రాంచంద్రారెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, బోయిని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎట్టి శ్రీనివాస్, తలారి అంజయ్య, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఇమ్రాన్, రవీందర్, వెంకటేశం, దామోదర్, దత్తు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ పుల్కల్ మండలాధ్యక్షుడు దుర్గారెడ్డి

కోహీర్-బిలాల్‌పూర్ ప్రధాన రోడ్డు దుస్థితి

రోడ్లు అధ్వానం.. కంపు కొడుతున్న పరిసరాలు

కోహీర్, జూన్ 8: కాంగ్రెస్ ఆరు నెలల పాలనలో మార్పు స్పష్టంగా కనిపిస్తున్నది. గతంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిపాలన కొనసాగింది. కానీ నేడు ఆ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు, రోడ్లపైనే మురుగు నీరు. కోహీర్ పట్టణంలో నేడు కండ్ల ముందు కనిపిస్తున్న సజీవ సాక్ష్యాలు. వాటికి పరిష్కార మార్గాన్ని చూపేదెవరో.

గొల్లబండ కాలనీలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

వరద నీరు.. జనం బేజారు

గుమ్మడిదల, జూన్ 8: దోమడుగులో వాననీటితో జనం ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం మండలంలోని దోమడుగులో కురిసిన వానకు ఇండ్ల వద్ద నీరు నిలిచిపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే వాన నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దోమడుగులో ఇండ్ల మధ్య నిలిచిన వాన నీరు

ప్రిలిమినరీకి 9,672 మంది అభ్యర్థులు

- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 8: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగనున్నది. జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, శనివారం పట్టణంలోని పలు కేంద్రాలను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. మొత్తం 9,672 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాలు, హాల్ టికెట్ డౌన్‌లోడ్‌కు జిల్లా స్థాయి హెల్ప్ లైన్ నంబరు 08455276155ను సంప్రదించాలని అధికారులు సూచించారు. http://www.tspsc.gov.inలో హాల్ టికెట్‌ను పొందవచ్చు. పరీక్షా కేంద్రంలోకి ఎవరికీ మొబైల్ ఫోన్లు అనుమతి లేదని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్, ఇతర ప్రభుత్వ ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకెళ్లాల్సి ఉంటుంది. బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌ను మాత్రమే అనుమతిస్తారు. అభ్యర్థులు షూస్, సాక్స్ ధరించరాదని అధికారులు స్పష్టం చేశారు. ఉదయం 10 గంటలు దాటితే పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదు. ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య అభ్యర్థులకు కేంద్రం లోపలికి అనుమతిస్తారు. ఉదయం 10 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు, స్మార్ట్ గడియారాలు, హ్యాండ్ బ్యాగులు, బ్లూటూత్ డివైజెస్‌లు, పెన్ డ్రైవ్‌లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదని తెలిపారు.

శ్రీనివాస్‌నగర్‌లో బస్తీదర్శన్

రామచంద్రాపురం, జూన్ 8: ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ 6, 7 బ్లాక్‌లో శనివారం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ బస్తీ దర్శన్ నిర్వహించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, కరెంట్, వీధి దీపాల సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆమె డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం నూతన పైప్‌లైన్‌ని వేయిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలను పెట్టిస్తామన్నారు. బస్తీలో ఏ సమస్య ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నవీన్‌యాదవ్, సాయిలు, లక్ష్మీ, నారాయణ ఉన్నారు.

శ్రీనివాస్‌నగర్‌లో డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

న్యాల్‌కల్: మిర్జాపూర్(బి)లో సర్కారు బడిలో చేరాలని కోరుతున్న ఉపాధ్యాయులు

నాగల్‌గిద్ద, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని శేరి దామర్‌గిద్ద ప్రభుత్వ పాఠశాలలో బడి బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే చేర్పించాలి

న్యాల్‌కల్, జూన్ 8: మౌలిక వసతులు, నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులను చేర్పించాలని మండల విద్యాధికారి మారుతీరాథోడ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్‌సార్ బడి బాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు శనివారం మండలంలోని ఖలీల్‌పూర్, మిర్జాపూర్(బి), మామిడ్గి, రేజింతల్, మెటల్‌కుంట, చాల్కి, న్యాల్‌కల్, హద్నూర్, ఆత్నూర్ తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సర్కారు బడిలో విద్యాబోధన, మౌలిక సదుపాయాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆంగ్ల విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం, ఉచితంగా పుస్తాకాలు, యూనిఫాం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'మై ఆటో ఈజ్ సేఫ్'తో సురక్షిత ప్రయాణం

జిన్నారం, జూన్ 8: ప్రజల సురక్షితమైన ప్రయాణానికే 'మై ఆటో ఈజ్ సేఫ్' కార్యక్రమాన్ని పోలీస్ శాఖ చేపట్టిందని జిన్నారం సీఐ సుధీర్‌కుమార్ అన్నారు. శనివారం జిన్నారంలోని ఆటో డ్రైవర్లకు మై ఆటో ఈజ్ సేఫ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆటోలకు ఎస్ఐ విజయ్‌రావుతో కలిసి స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు ఆటోలో ఎక్కే ముందు మై ఆటో ఈజ్ సేఫ్ స్టిక్కర్లు ఉన్నాయా లేదో చూడాలని, స్టిక్కర్ ఉన్న ఆటోలోనే ప్రయాణించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మై ఆటో ఈజ్ సేఫ్ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న సీఐ సుధీర్‌కుమార్

జోగిపేటలో మొసలి కళేబరం లభ్యం

అందోల్, జూన్ 8: జోగిపేట శివారులో శనివారం మృతిచెందిన మొసలిని స్థానికులు గుర్తించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. పట్టణంలోని రాజరాజేశ్వరి ఆలయం సమీపంలోని అటవీ ప్రాంతంలోకి పక్కనే ఉన్న కాలువల్లో నుంచి వచ్చిన మొసలి అక్కడే మృతి చెందింది. రెండు, మూడు రోజుల క్రితమే మొసలి చనిపోయి ఉండొచ్చని స్థానికులు చెప్పారు. శనివారం అటు వైపునకు వెళ్లిన స్థానికులకు కదలకుండా ఉన్న మొసలిని చూసి సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు.

మడుగును తలపిస్తున్న ఖాజీపల్లి సమీపంలో ఓఆర్ఆర్ బ్రిడ్జి కింది ప్రాంతం

చెరువును తలపిస్తున్న సర్వీస్ రోడ్డు

జిన్నారం/బొల్లారం, జూన్ 8: జిన్నారం మండలం ఖాజీపల్లి శివారులోని ఔటర్ రింగు రోడ్డు కింద నుంచి మల్లంపేట్ వైపు వెళ్లే బ్రిడ్జి ప్రాంతం వాన నీటితో మడుగును తలపిస్తున్నది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి నీరు పారే అవకాశం లేక ఇలా కుంట తయారైంది. దీంతో సర్వీస్ రోడ్డు నుంచి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ మూడేండ్లుగా ఇదే పరిస్థితి ఉంది. మడుగులా ఏర్పడిన నీళ్లు తగ్గుతుండగానే మరో వర్షం కురవడంతో ఎప్పటికీ నీరు నిల్వ ఉంటోంది. సంబంధిత అధికారులు సమస్యను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.



గుమ్మడిదల: బొంతపల్లి మార్కెట్లో చేపలను విక్రయిస్తున్న మత్స్యకారులు

మృగశిర సందడి

గుమ్మడిదల/జిన్నారం, జూన్ 8: మృగశిర కార్తెను పురస్కరించుకొని శనివారం మార్కెట్లు సందడిగా మారాయి. చేపల అమ్మకాలు జోరుగా సాగాయి. గుమ్మడిదల, బొంతపల్లి, అన్నారం తదితర మార్కెట్లో చేపలు విక్రయించారు. కొర్రమీను(కొరమట్ట)కిలో రూ.600 నుంచి 800 వరకు విక్రయించారు. రవు, బంగారుతీగ, బొచ్చ మొదలగు చేపల రకాలు కిలో రూ.200 నుంచి 300 వరకు విక్రయించారు. జిన్నారం, సోలక్‌పల్లి, మాదారం తదితర గ్రామాల్లో చేపలు కొనేందుకు జనాలు ఎగపడ్డారు.

జిన్నారం: గడ్డపోతారంలో మత్స్యకారులు, ముదిరాజ్‌లకు చేపల పంపిణీ దృశ్యం

చెరువులపై పూర్తి హక్కు ముదిరాజులదే..

అక్రమంగా చేపలు పట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

పోలీసులకు ఫిర్యాదు చేసిన ముదిరాజ్ కులస్తులు

పుల్కల్, జూన్ 8: మండలంలోని మిన్పూర్‌లో గ్రామానికి చెందిన కొందరు శనివారం దౌర్జన్యంగా కుడి చెరువులో చేపలు పట్టారని 100 మంది మత్స్యకారులు శనివారం పుల్కల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చెరువులపై పూర్తి హక్కు ముదిరాజ్ కులానికి చెందిన వారికే ఉంటుందని, ఇతర కులాలకు చెందిన వారికి ఉండదని ముదిరాజ్ సంఘం మండల కన్వీనర్ మహేశ్ బాబు అన్నారు. కానీ, కొందరు వ్యక్తులు మీరేం చేసుకుంటారో చేసుకోండి మేము చేపలు పట్టి తీరుతామని దౌర్జన్యంగా చెరువులోకి దిగి చేపలు పట్టారంటూ ఎస్ఐ శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. దౌర్జన్యంగా చేపలు పట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పిన తర్వాత తిరిగి వెళ్లిపోయారు.

మేళ్ల చెరువు వరద కాల్వను బాగు చేయండి

రామచంద్రాపురం, జూన్ 8: తెల్లాపూర్ పరిధిలోని మేళ్ల చెరువు వరద కాల్వను మెరుగుపర్చాలని బీఆర్ఎస్ నాయకుడు వడ్డే నర్సింహులు ఇరిగేషన్ అధికారులను కోరారు. తెల్లాపూర్ గ్రామంలోని మేళ్ల చెరువుకు సంబంధించిన వరద కాల్వ కూరుకుపోయిందని, వాన నీరు చెరువులోకి సాఫీగా వెళ్లే పరిస్థితి లేదన్నారు. వానలు కురుస్తున్నందున ఇరిగేషన్ అధికారులు వరద కాల్వలను పరిశీలించాల్సింది పోయి కనీసం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మేళ్ల చెరువు వరద కాల్వను పరిశీలించి బాగు చేయాలని డిమాండ్ చేశారు.

కురుకుపోయిన మేళ్ల చెరువు వరద కాల్వను చూపిస్తున్న నర్సింహులు

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

.న్యాల్‌కల్, జూన్ 8: గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని మండలంలోని మిర్జాపూర్(బి) వైద్యాధికారి నృపేన్‌చక్రవర్తి అన్నారు. శనివారం మండలంలోని ఖలీల్‌పూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పరిసరాల శుభ్రత, ఆరోగ్యం, పోషక విలువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వ్యాధులు సోకితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చి పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్యామల, ఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖలీల్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

విద్యార్థుల యూనిఫాం రెడీ

మనూరు, జూన్ 8: విద్యార్థులకు యునిఫాంలు సిద్ధంగా ఉన్నాయని ఐకేపీ డీపీఎం జయశ్రీ అన్నారు. శనివారం మనూరు ఐకేపీ కేంద్రంలో కొనసాగుతున్న కుట్టు మిషన్ కేంద్రాన్ని పరిశీలించారు. మనూరు, నాగల్‌గిద్ద మండలాల స్కూళ్లకు సంబంధించి యూనిఫాంలు సిద్ధం చేస్తున్నారన్నారు. యూనిఫాంలో నాణ్యతలో రాజీలేకుండా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎంలు వంశీకృష్ణ, అనంతయ్య, ఐకేపీ సీసీలు తుకారం, జయప్ప, సాయిలు, సంగయ్య, నాగమణి, అకౌంటెంట్ సంజీవులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రజావాణి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 8: ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నుంచి యథాతథంగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీ నుంచి పునఃప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడంతో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని, ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రజావాణి తిరిగి కొనసాగుతుందని తెలిపారు.

అది పులి కాదు.. కుక్క

హత్నూర, జూన్ 8: మండల కేంద్రమైన హత్నూర శివారులోని మల్లగుట్టలవద్ద పులి సంచరిస్తున్నట్లు వచ్చిన ప్రచారంలో వాస్తవం లేదని, కుక్క అడుగులను చూసి పులి ఉందని పుకార్లు పుట్టించారని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శాహిని స్పష్టం చేశారు. శనివారం మల్లన్న గుట్టలను ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శాహిని, బీట్ ఆఫీసర్ సంతోష, సిబ్బందితో కలిసి మల్లన్నగుట్టలను పరిశీలించారు. కేవలం కుక్క అడుగులు మాత్రమే కనిపించాయని, కావాలనే పులి కనిపించిందని పుకార్లు సృష్టించారన్నారు. పులి సంచరిస్తే పులి అడుగులు కనిపించేవని చెప్పారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు.

రైతుల కోసం కంట్రోల్ రూమ్

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 8: కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహరావు శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రైతులకు ఎలాంటి సమాచారం కావాలన్నా సంప్రదించవచ్చన్నారు. ఎరువులు, విత్తనాలు బ్లాక్ మార్కెట్‌లో అమ్మినా, అధిక ధరలకు విక్రయించినా కంట్రోల్ రూమ్ హెల్ప్ లైన్ నంబర్(08455-276456)పై సంప్రదించవచ్చన్నారు.

ఖాజీపల్లి కాలనీలో చోరీ

జిన్నారం, జూన్ 8: ఖాజీపల్లి కాలనీలో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన మోహన్‌రెడ్డి కుటుంబంతో కలిసి సర్వేనంబర్ 181లోని కాలనీలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం పని నిమిత్తం మోహన్‌రెడ్డి ఊరికి వెళ్లాడు. అతడి భార్య ఒక్కతే ఉండడంతో అదే కాలనీలో ఉండే బంధువుల ఇంటికి రాత్రి పడుకోవడానికి వెళ్లింది. ఇదే అదనుగా భావించిన దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి రూ.85వేలు ఎత్తుకెళ్లారు. ఇంట్లోని సామగ్రిని చిందరవందరగా పడేశారు. ఉదయం నిద్రలేచి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం, ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడి ఉండడంతో మోహన్‌రెడ్డికి సమాచారం ఇచ్చింది. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బియ్యం ఇవ్వడం లేదని రేషన్ షాపునకు తాళం

దుదుగొండలో రేషన్ దుకాణానికి తాళం వేస్తున్న గ్రామస్తులు

మనూరు, జూన్ 8: రేషన్ డీలర్ ప్రతి నెలా రేషన్ సక్రమంగా ఇవ్వడం లేదని గ్రామస్తులు ఆందోళన చేశారు. శనివారం మనూరు మండల పరిధిలోని దుదగొండ గ్రామంలో రేషన్ డీలర్ బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. డీలర్ ఆరు నెలలుగా ఇదేతంతుగా కొనసాగిస్తున్నాడని గ్రామస్తులు డీలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి సరిపడా బియ్యం తీసుకురావడం లేదని రేషన్ దుకాణానికి తాళం వేసి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.